# తెలంగాణ వెన్నెల వాక్కు

TGTEL/25/A0871

జాతీయ దినపత్రిక

TELANGANAVENNELA WAKKU

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక :33 16-08- 2026 ఆదివారం పేజీలు: 4 వెల:03/-



తెలంగాణ వెన్నెల వాక్కు విలేకరులు కావలెను

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం

మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం 7386173123 నంబర్‌ను సంప్రదించండి..

డి. యోగేష్ కుమార్, సీఈవో








## తెలంగాణను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గోల్కొండ కోటలో జాతీయ జెండాను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. గడిచిన రెండున్నరేళ్ల ప్రజాపాలనలో తెలంగాణ పునర్నిర్మాణానికి బలమైన పునాదులు వేశామని, భవిష్యత్ తెలంగాణ నిర్మాణాన్ని మరింత వేగంగా ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ప్రజలు, ఉద్యోగులు, అధికారులు అందరి భాగస్వామ్యంతో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు.



ప్రజా ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తోందని సీఎం పేర్కొన్నారు. పేదల ఆర్థిక పురోగతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, ప్రతి పథకం వెనుక శాస్త్రీయ దృక్పథంతో పాటు మానవీయత, సామాజిక బాధ్యత ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తూ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు, సాంకేతికత, నైపుణ్యాలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందనే లక్ష్యంతో రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వ్యవసాయాన్ని పండగగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని, వరి సాగు విస్తీర్ణం, దిగుబడిలో తెలంగాణ దేశంలోనే ముందంజలో నిలిచిందని సీఎం వివరించారు. కృష్ణా, గోదావరి నదీ జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన వాటా కోసం ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని స్పష్టం చేశారు. పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యత

2

## వికసిత భారతానికి భారీ సంకల్పం

### స్వావలంబన, యువశక్తి, సాంకేతికతతో 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశమే లక్ష్యం

న్యూఢిల్లీ బ్యూరో

దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఢిల్లీలోని చారిత్రక ఎర్రకోట వేదికగా ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎర్రకోటపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వరుసగా 13వసారి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి జాతిని ఉద్దేశించి ప్రసంగించిన మోదీ.. 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన, స్వావలంబన కలిగిన శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దాలనే లక్ష్యాన్ని మరోసారి స్పష్టం చేశారు.

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రధాని తన ప్రసంగాన్ని ప్రారంభించారు. దేశ స్వాతంత్ర్యం కోసం జీవితాలను అర్పించిన మహనీయుల ఆశయాలను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రతి భారతీయుడిపై ఉందన్నారు. దేశం గతంలో సాధించిన విజయాలను గుర్తు చేస్తూనే, రానున్న కాలంలో మరింత వేగంగా అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దేశ ప్రజల ఐక్యత, క్రమశిక్షణ, పట్టుదలతో భారత్ ప్రపంచంలో మరింత కీలకమైన శక్తిగా ఎదగగలదని

2

## ప్రజల కోసమే ప్రజా ప్రభుత్వం

హైదరాబాద్ బ్యూరో

ప్రజా ప్రభుత్వం పాలకులు కోసం కాకుండా ప్రజల కోసం పని చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అధికారము చలాయించడం, వ్యక్తుల వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రజాప్రభుత్వం పనిచేయడం లేదని ఆయన చెప్పారు. ఖమ్మం కలెక్టరేట్ లో డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డ్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన అందించారు. అనంతరం ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజల కోసం ప్రజా ప్రభుత్వం పని చేస్తోంది కాబట్టే.. ఈరోజు రాష్ట్రంలో ఇన్ని సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తుందని చెప్పారు. ?ప్రజల ఉజ్వల భవిష్యత్తు, ప్రజల సర్వతోముఖాభివృద్ధి కోసం పునాదులు వేస్తూ... ఇందిరమ్మ ప్రజాప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం.. దేశంలోని ఉన్న రాష్ట్రాలతో కాదు, ప్రపంచంతో అభివృద్ధి చెందిన అనేక దేశాలతో పోటీపడి ఎదిగే స్థాయికి ప్రజా ప్రభుత్వం పునాదులు వేస్తుందన్నారు. దేశప్రజలకు స్వాతంత్ర దినోత్సవం పెద్ద పండుగ రోజని అన్నారు. ఇది కులాలకి, మతాలకి, ప్రాంతాలకి అతీతంగా దేశంలో ఉన్నటువంటి ప్రతి ఒక్కరూ జరుపుకునేటటువంటి జాతీయ పండుగ అని అన్నారు. ఈరోజు మనమంతా స్వేచ్ఛగా ప్రజాస్వామ్య విధానాన్ని ఏర్పాటు చేసుకుంటున్నామని అన్నారు. మన ఓటు ద్వారా ప్రభుత్వాలను ఎన్నుకొని, ప్రజల అవసరాలు తీర్చుకునే విధంగా ప్రజాస్వామ్య ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకుంటున్నామని ఆయన చెప్పారు. అందువల్లే ఈ రోజు మనమందరం స్వేచ్ఛగా బతకగలుగుతున్నమని అన్నారు. భారత రాజ్యాంగాన్ని , దేశ స్వాతంత్రాన్ని, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థని మనకు అందించిన మహానుభావులని ఈ సందర్భంగా గుర్తు చేసుకోవడం, వారికి మన కర్తవ్యము అని ఆయన చెప్పారు.



దేశ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను ప్రజా ప్రభుత్వం పంపిణీ చేస్తుందని అన్నారు. రాష్ట్రంలోని నిరుపేదలకు సన్న బియ్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఏ ఒక్క పేద కుటుంబం ఆకలితో ఉండకూడదన్న లక్ష్యంతో ప్రజా ప్రభుత్వ పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలో కోటి 15 లక్షల కుటుంబాలు ఉంటే... అందులో కోటి 6 లక్షల 28 వేల 92 కుటుంబాలకి రేషన్ కార్డులు ఉన్నాయని చెప్పారు. ఈ రేషన్ కార్డుల ద్వారా 3 కోట్ల 42 లక్షల 57 వేల 109 మందికి, ప్రతి ఒక్కరికి 6 కేజీల లెక్కన సన్న బియ్యాన్ని ప్రతి నెల ప్రజా ప్రభుత్వం అందిస్తోందని ఆయన చెప్పారు. ఇంతటి బృహత్తరమైన కార్యక్రమం దేశంలో మరే రాష్ట్రంలోనూ లేదని ఆయన తెలిపారు. సన్న బియ్యం మార్కెట్లో 50 నుంచి 55 రూపాయల ధర ఉందని.. అలాంటి బియ్యాన్ని ప్రభుత్వం మనిషికి 6 కేజీల లెక్కన ఉచితంగా అందిస్తోందని ఆయన చెప్పారు. ఇందుకు అయ్యే ఖర్చు మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం పౌర సరఫరాల శాఖకు చెల్లిస్తుందని ఉపముఖ్యమంత్రి తెలిపారు. గత బిఆర్ఎస్ హయాంలో ఈ రేషన్ కార్డుల కోసం ప్రజలు ఎంత ఇబ్బందులు పడ్డారో అందరికీ తెలిసిందేనని ఆయన అన్నారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత ఆస్తులు, సంస్థలు, వ్యవస్థలు అన్నీ ప్రజలకు పెద్ద ఎత్తున ఉపయోగపడతాయని అందరూ అనుకున్నారు. కానీ అలాంటి వాతావరణం గతంలో ఎన్నడూ

2

## పోటీ చేసేది ఎక్కడో రాహుల్ గాంధీ నిర్ణయిస్తారు

### జగ్గారెడ్డి పొలిటికల్ భవిష్యత్తుపై రేవంత్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

సంగారెడ్డి బ్యూరో

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి రాజకీయ భవిష్యత్తు మరియు వచ్చే ఎన్నికల్లో ఆయన పోటీ చేసే స్థానంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

సంగారెడ్డిలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి, జగ్గారెడ్డి ఎన్నికల పోటీపై పదేపదే చేస్తున్న ప్రకటనలపై తనదైన శైలిలో స్పందించారు.

పోటీ నిలిపేది లేదన్న రేవంత్‌రెడ్డి

గతంలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో సంగారెడ్డి నియోజకవర్గం నుంచి పోటీ చేసిన జగ్గారెడ్డి స్వల్ప తేడాతో ఓటమి పాలైన విషయం తెలిసిందే. ఈ పరిణామాల అనంతరం తాను ఇకపై ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయబోనని, ముఖ్యంగా సంగారెడ్డి నుంచి అసెంబ్లీ బరిలో నిలబడనని ఆయన కొన్ని సందర్భాల్లో వ్యాఖ్యానించారు. ఈ అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ---"ఎన్నికల్లో నిలబడను అని జగ్గారెడ్డి ఏందేందో మాట్లాడుతున్నారు. ఆయన పోటీ చేయడం లేదా పోటీ నుంచి తప్పుకోవడం అనేది ఆయన చేతుల్లోగానీ, మా చేతుల్లోగానీ లేదు. జగ్గారెడ్డి ఎక్కడి నుంచి పోటీ చేయాలనేది అంతిమంగా మన నాయకుడు రాహుల్‌గాంధీ మాత్రమే నిర్ణయిస్తారు" అని స్పష్టం చేశారు.



చమత్కార శైలిలో కామెంట్స్:

సభలో కార్యకర్తల సమక్షంలో సీఎం రేవంత్ రెడ్డి జగ్గారెడ్డిపై చమత్కారంగా కూడా మాట్లాడారు. "ఒకవేళ జగ్గారెడ్డి మళ్లీ ఎన్నికల్లో పోటీ చేయనని మాట్లాడితే, ఆయనను ఇంట్లో పెట్టి తాళం వేయండి" అని అనడంతో సభా ప్రాంగణం నవ్వులతో నిండిపోయింది. జగ్గారెడ్డిని పార్టీకి మరియు రాహుల్ గాంధీకి అత్యంత నిబద్ధత కలిగిన నాయకుడిగా రేవంత్ అభివర్ణించారు. "రాహుల్‌గాంధీ రాముడైతే, జగ్గారెడ్డి ఆ రాముడికి హనుమంతుడు లాంటివారు. ఆయన ఏనాడూ రాహుల్ మాటను దాటరు" అని సీఎం కొనియాడారు.

ఓటమిపై ఆవేదన -- సీఎం అండ:

2023 తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో జగ్గారెడ్డి ఓటమి చెందడంపై రేవంత్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. "ఒకవేళ జగ్గారెడ్డి సంగారెడ్డి నుంచి విజయం సాధించి ఉంటే, ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వంలో చాలా ముఖ్యమైన పాత్రలో, కీలకమైన మంత్రి పదవిలో ఉండేవారు" అని వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ఫలితం ఎలా ఉన్నప్పటికీ జగ్గారెడ్డి నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ పార్టీ బలోపేతానికి, నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని ఆయన గుర్తుచేశారు.

పార్టీలో సరికొత్త చర్చ:

రేవంత్‌రెడ్డి చేసిన ఈ ప్రకటనలతో కాంగ్రెస్ వర్గాల్లో జగ్గారెడ్డి భవిష్యత్ రాజకీయ ప్రణాళికలపై ఆసక్తి నెలకొంది. జగ్గారెడ్డిని మళ్లీ సంగారెడ్డి అసెంబ్లీ నుంచే బరిలోకి దించుతారా లేదా రాహుల్ గాంధీ సూచనల మేరకు రాబోయే లోక్‌సభ స్థానానికో లేక

2




# అభివృద్ధి--సంక్షేమంలో నిర్మల్ ముందంజ

## ఇల్లు నుంచి వ్యవసాయం వరకు.. అన్ని రంగాల్లో ప్రగతి

నిర్మల్: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో నిర్మల్ జిల్లా ముందుకు సాగుతోంది. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల ప్రగతి నివేదికను వెల్లడించింది. ప్రజలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడంతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోంది.
ఇందిరమ్మ ఇళ్లకు భారీగా నిధులు: పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో జిల్లాకు 7,737 ఇళ్లు మంజూరయ్యాయి. ఇప్పటివరకు 2,711 ఇళ్ల నిర్మాణం పూర్తికాగా.. లబ్ధిదారులకు రూ.157.69 కోట్ల నిధులు విడుదలయ్యాయి.
మహిళలకు ఉచిత ప్రయాణం: మహాలక్ష్మి పథకం ద్వారా జిల్లాలో ఇప్పటివరకు 7.45 కోట్లకు పైగా ఉచిత బస్సు ప్రయాణాలు నమోదయ్యాయి. వీటి విలువ రూ.288.83 కోట్లుగా ఉంది.
విద్యకు ప్రాధాన్యం: 2026--27 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో 49,226 మంది విద్యార్థులు నమోదయ్యారు. 739 పాఠశాలల్లో 41,534 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం అల్పాహారం అందిస్తున్నారు. 628 పాఠశాలల్లో రూ.20.65 కోట్లతో మౌలిక వసతుల పనులు చేపట్టారు. కేజీబీవీల్లో పదో తరగతి ఫలితాల్లో 98.96 శాతం ఉత్తీర్ణత నమోదైంది.
రైతులకు భరోసా: రైతు భరోసా పథకం కింద జిల్లాలో 1,89,924 మంది రైతులకు రూ.267.96 కోట్ల పంట పెట్టుబడి సాయం అందించారు. రైతు భీమా కింద మరణించిన 599 మంది రైతు కుటుంబాలకు రూ.29.95 కోట్ల పరిహారం అందించారు. పలు పంటలను కనీస మద్దతు ధరతో కొనుగోలు చేయడంతో 44,878 మంది రైతులు లబ్ధి పొందారు.
గ్రామీణాభివృద్ధికి ఊతం: ఉపాధి హామీ పథకంలో 92 శాతం పని దినాల సాధనతో జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. మహిళా సంఘాల ద్వారా పలు కార్యక్రమాలు చేపడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారు.
పట్టణాల్లో మౌలిక వసతులు: నిర్మల్ మున్సిపాలిటీలో అమృత్--2.0 కింద తాగునీరు, మురుగునీటి శుద్ధి, ప్రధాన కాలువల పునరుద్ధరణ, సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులు చేపడుతున్నారు. భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల్లోనూ పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి
సంక్షేమానికి పెద్దపీట: కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా జిల్లాలో 11,821 మంది లబ్ధిదారులకు రూ.118.34 కోట్లకు పైగా ఆర్థిక సహాయం అందించారు. బీసీ, ఎస్సీ, మైనారిటీ విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇతర సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనాలు కల్పిస్తున్నారు.
వైద్య రంగంలోనూ అభివృద్ధి: ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలను విస్తరిస్తూ డయాలసిస్, ఇతర వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో 300 మంది ఎంబీబీఎస్ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.
బాసర అభివృద్ధికి రూ.354 కోట్లు: ప్రముఖ పుణ్యక్షేత్రం బాసర సరస్వతి అమ్మవారి ఆలయ అభివృద్ధికి రూ.354 కోట్లతో పలు పనులు చేపడుతున్నారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.
సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు మౌలిక వసతులు మెరుగుపరచడం, రైతులు, మహిళలు, విద్యార్థులు, పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడం ద్వారా నిర్మల్ జిల్లాను మరింత అభివృద్ధి పథంలో నడిపించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయి.

# తెలంగాణను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం: సీఎం రేవంత్‌రెడ్డి

క్రమంలో పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు నీటిని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.
పేదల ఆత్మగౌరవాన్ని కాపాడేలా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని సీఎం అన్నారు. తొలి దశలో లక్షలాది ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. రాష్ట్రంలోని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, చేనేత కార్మికులు తదితరులకు సామాజిక భద్రతా పింఛన్లు అందిస్తున్నామని చెప్పారు. కొత్త రేషన్ కార్డులు జారీ చేయడంతో పాటు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు.
తెలంగాణ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యతగా తీసుకుందని సీఎం తెలిపారు. ఇప్పటివరకు ప్రభుత్వ శాఖల్లో 72 వేలకు పైగా ఉద్యోగ నియామకాలు పూర్తి చేశామని, వివిధ గ్రూప్ ఉద్యోగాలు, ఉపాధ్యాయ నియామకాలు, పోలీసు ఉద్యోగాల భర్తీ చేపట్టామని వివరించారు. నోటిఫికేషన్లు ఇచ్చి ఆగిపోకుండా పరీక్షలు, ఫలితాలు, ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి అభ్యర్థులకు నియామక పత్రాలు అందించామని చెప్పారు.
మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని రేవంత్‌రెడ్డి సూచించారు. కేవలం విద్యార్హతలు మాత్రమే కాకుండా నైపుణ్యాలు ఉంటేనే భవిష్యత్‌లో మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. నైపుణ్యాభివృద్ధి సంస్థలు, పాలిటెక్నిక్ కళాశాలలు, ఇతర సాంకేతిక విద్యా సంస్థల ద్వారా యువతకు అవసరమైన శిక్షణ అందిస్తామని తెలిపారు.
విద్యారంగంలో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని సీఎం పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయడంతో పాటు వైద్యరంగంలోనూ విస్తృతమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కొత్త వైద్య కళాశాలలు, ఆసుపత్రులు, నర్సింగ్, పారామెడికల్ కళాశాలలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.
డ్రగ్స్, ఆహార కల్తీపై ఉక్కుపాదం మోపుతున్నామని సీఎం తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఆహార కల్తీ, మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. తనిఖీలను విస్తృతం చేసి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.
పెట్టుబడుల ఆకర్షణలో తెలంగాణ వేగంగా ముందుకు వెళ్తోందని సీఎం అన్నారు. సమాచార సాంకేతిక రంగంతో పాటు కృత్రిమ మేధ, డేటా కేంద్రాలు, ఔషధ, రక్షణ, అంతరిక్ష రంగాల్లో పెట్టుబడులకు రాష్ట్రంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రపంచస్థాయి సంస్థలను తెలంగాణకు తీసుకురావడంతో పాటు యువతకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.
భారత్ భవిష్యత్ నగరం, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులు హైదరాబాద్ రూపురేఖలను మార్చబోతున్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రపంచస్థాయి మౌలిక వసతులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. భవిష్యత్ తెలంగాణ నిర్మాణంలో రైతులు, యువత, మహిళలు, కార్మికులు, ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.
ప్రజల సమస్యలకు మండల స్థాయిలోనే పరిష్కారం చూపేందుకు ఈ నెల 17 నుంచి రాష్ట్రంలోని అన్ని ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సీఎం ప్రకటించారు. త్వరలో ప్రజావాణి కోసం ఆన్‌లైన్ సౌకర్యాన్ని కూడా అందుబాటులోకి తీసుకువచ్చి, రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా ప్రజలు తమ సమస్యలను నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తామని తెలిపారు.
“తెలంగాణ పోటీ ఇతర రాష్ట్రాలతో కాదు.. ప్రపంచంతో. సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతాం. భగవంతుడి ఆశీస్సులు, ప్రజల సహకారంతో తెలంగాణను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం” అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.

# దేవాలయం ఎక్కడ ఉంది?

# మనసులోనా... గోపురం కిందనా?

## కాలం మారినా ఆధ్యాత్మికత ఎందుకు అవసరం?

మనిషి జీవితంలో దేవాలయానికి ఉన్న స్థానం ప్రత్యేకమైనది. చిన్న గ్రామంలోని గుడి నుంచి ప్రపంచ ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం వరకు ప్రతి ఆలయం వెనుక ఒక విశ్వాసం, ఒక చరిత్ర, ఒక సంస్కృతి ఉంటుంది. గుడి గంట మోగినప్పుడు మనసుకు కలిగే ప్రశాంతత, దీపం వెలిగినప్పుడు కలిగే ఆత్మీయత, దేవుడి ముందు కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా నిలబడినప్పుడు కలిగే అనుభూతి---ఇవన్నీ మనిషి అంతరంగంతో ముడిపడి ఉంటాయి.
అయితే నేటి ఆధునిక జీవితంలో ఒక ప్రశ్న మరింత ప్రాధాన్యం సంతరించుకుంటోంది. దేవుడి కోసం మనం దేవాలయానికి వెళు_న్నామా? లేక మనశ్శాంతి కోసం వెళు_న్నామా?
ఈ రెండింటినీ వేరు చేయడం అంత సులభం కాదు. ఎందుకంటే భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయంలో దేవాలయం కేవలం దేవుడి విగ్రహం ఉన్న ప్రదేశం కాదు. అది మనిషి కొంతసేపైనా తన బాహ్య ప్రపంచాన్ని పక్కన పెట్టి తన అంతరంగాన్ని పరిశీలించుకునే స్థలం. అందుకే ప్రాచీన కాలం నుంచి ఆలయ నిర్మాణం, పూజా విధానం, గంటానాదం, దీపారాధన, ప్రదక్షిణ వంటి సంప్రదాయాలకు ప్రత్యేకమైన ప్రాధాన్యం ఏర్పడింది.
కానీ సమస్య ఎక్కడ వస్తోంది అంటే... ఆలయంలో ప్రశాంతంగా ఉన్న మనిషి, బయటకు వచ్చిన వెంటనే ఎందుకు అదే కోపం, అదే అసూయ, అదే ద్వేషంతో జీవిస్తున్నాడు?
దేవుడి ముందు తల వంచడం ఒక ఆచారం. కానీ మన అహంకారాన్ని తగ్గించుకోవడం ఆ ఆచారం యొక్క అసలు సందేశం. దీపం వెలిగించడం ఒక సంప్రదాయం. కానీ మన ఆలోచనల్లోని చీకటిని తొలగించుకోవడం దాని అంతరార్థం. దేవుడికి పుష్పం సమర్పించడం ఒక పూజ. కానీ మన ప్రవర్తనలో మంచితనాన్ని వికసింపజేయడం దాని అసలు ప్రయోజనం.
ఇక్కడే ఆధ్యాత్మికతకు, కేవలం ఆచారానికి మధ్య తేడా కనిపిస్తుంది.
నేటి మనిషి ఎన్నో సౌకర్యాలు సంపాదించాడు. సాంకేతికత ప్రపంచాన్ని దగ్గర చేసింది. ఒక క్లిక్‌తో సమాచారం అందుతోంది. కానీ అదే సమయంలో మానసిక ఒత్తిడి, ఆందోళన, ఒంటరితనం కూడా పెరుగుతున్నాయి. రోజంతా ఇతరులతో మాట్లాడుతున్నా, మనతో మనం మాట్లాడుకునే సమయం మాత్రం తగ్గిపోతోంది.
అలాంటి సమయంలో ఆధ్యాత్మికత మనిషికి ఒక విరామాన్ని ఇవ్వగలదు. ప్రతిరోజూ కొంతసేపు నిశ్శబ్దంగా ఉండటం, ప్రార్థన చేయడం, ధార్మిక గ్రంథాన్ని చదవడం, ధ్యానం చేయడం లేదా ప్రకృతిలో ప్రశాంతంగా గడపడం---ఇవి మనసును సమతుల్యం చేయడానికి సహాయపడే మార్గాలు. వీటిని మూఢనమ్మకాలుగా కాకుండా ఆత్మపరిశీలనకు సాధనాలుగా చూడాలి.
అయితే ఆధ్యాత్మికత అంటే ప్రపంచ బాధ్యతల నుంచి దూరంగా వెళ్లడం కాదు. కుటుంబాన్ని వదిలి అడవులకు వెళ్లడం కాదు. మన బాధ్యతలను మరింత నిబద్ధతతో నిర్వర్తించడమే నిజమైన ఆధ్యాత్మికత.
తల్లిదండ్రుల పట్ల బాధ్యత, పిల్లల పట్ల ప్రేమ, ఉద్యోగంలో నిజాయితీ, సమాజం పట్ల బాధ్యత, ప్రకృతి పట్ల గౌరవం---ఇవన్నీ ధర్మంలో భాగాలే. మనిషి తన జీవితాన్ని సక్రమంగా నడిపించుకుంటూ, ఇతరులకు హాని చేయకుండా, తన వల్ల సాధ్యమైనంత మంచిని చేయగలిగితే అదే ఆధ్యాత్మిక జీవనానికి ఒక మంచి ఉదాహరణ.
అందుకే దేవాలయానికి వెళ్లడం అవసరం లేదని చెప్పడం ఎంత తప్పో, దేవాలయానికి వెళ్లడమే ఆధ్యాత్మికత అని భావించడం కూడా అంతే అసంపూర్ణం.
గోపురం మనకు దారి చూపుతుంది... కానీ ఆ దారిలో నడవాల్సింది మనమే.
దీపం వెలుగును చూపిస్తుంది... కానీ మనలో వెలుగు వెలిగించాల్సింది మనమే.
దేవుడి ముందు నిలబడటం భక్తి... కానీ దేవుడి బోధను జీవితంలో ఆచరించడం ధర్మం.
చివరికి దేవాలయం ఎక్కడ ఉందన్నది మాత్రమే ప్రశ్న కాదు. మనిషి హృదయంలో ధర్మానికి, దయకు, నిజాయితీకి ఎంత స్థానం ఉందన్నదే అసలు ప్రశ్న.



విశ్లేషణ: దేగామ యోగేష్ కుమార్
సీనియర్ జర్నలిస్ట్ । తెలంగాణ వెన్నెల వాక్కు

# వికసిత భారతానికి భారీ సంకల్పం

## స్వావలంబన, యువశక్తి, సాంకేతికతతో 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశమే లక్ష్యం

విశ్వాసం వ్యక్తం చేశారు.

2047 లక్ష్యంగా అభివృద్ధి చెందిన భారత్

స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మోదీ తెలిపారు. ఇందుకోసం దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు తయారీ రంగం, వ్యవసాయం, సాంకేతిక పరిజ్ఞానం, మౌలిక వసతులు, రక్షణ రంగం, పర్యావరణ పరిరక్షణ, సాంస్కృతిక శక్తి వంటి కీలక రంగాలను సమగ్రంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.
దేశ ప్రగతికి ఏడు ప్రధాన శక్తులను ఆధారంగా చేసుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ప్రధాని వివరించారు. తయారీ రంగం బలోపేతం, వ్యవసాయం--ఆహార ఉత్పత్తి అభివృద్ధి, సాంకేతికత--ఆవిష్కరణలు, వేగవంతమైన మౌలిక వసతుల అభివృద్ధి, రక్షణ ఉత్పత్తుల్లో స్వావలంబన, పర్యావరణహిత ఆర్థిక వ్యవస్థ, భారతీయ సంస్కృతి--సామర్థ్యాలను ప్రపంచానికి చాటిచెప్పడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు.

యువతే దేశ భవిష్యత్తు

దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని మోదీ స్పష్టం చేశారు. యువతకు నాణ్యమైన విద్య, నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే ఏడాదిలో కోటి మంది యువతకు కృత్రిమ మేధస్సుపై శిక్షణ అందించే కార్యక్రమాన్ని ప్రకటించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ అందించే చర్యలను కూడా వెల్లడించారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఖరీదైన శిక్షణ సంస్థలపై ఆధారపడకుండా మెరుగైన అవకాశాలు పొందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.
యువత పెద్ద కలలు కనాలని, వాటిని సాధించేందుకు క్రమశిక్షణతో కష్టపడాలని ప్రధాని పిలుపునిచ్చారు. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్న నేపథ్యంలో కొత్త నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. భారత యువశక్తి ప్రపంచ స్థాయిలో పోటీ పడే సామర్థ్యం కలిగి ఉందని, ఆ శక్తిని దేశ నిర్మాణానికి వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు.

స్వదేశీ ఉత్పత్తులకు ప్రాధాన్యం

దేశ ఆర్థిక స్వావలంబన కోసం స్వదేశీ ఉత్పత్తులకు ప్రోత్సాహం ఇవ్వాలని ప్రధాని పిలుపునిచ్చారు. దేశంలో తయారయ్యే వస్తువులకు ప్రజలు ప్రాధాన్యం ఇవ్వాలని, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు దేశీయ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. రక్షణ పరికరాలు, ఎలక్ట్రానిక్స్, రైల్వే పరికరాలు, సాంకేతిక ఉత్పత్తుల తయారీలో భారత్ సాధిస్తున్న పురోగతిని ప్రస్తావించారు.
అత్యాధునిక సాంకేతిక రంగాల్లో భారతదేశం మరింత బలపడాల్సిన అవసరం ఉందని చెప్పారు. అర్ధవాహక చిప్‌ల తయారీ, కృత్రిమ మేధస్సు, డిజిటల్ సాంకేతికత, పరిశోధన--ఆవిష్కరణల రంగాల్లో భారీగా పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న సంవత్సరాల్లో దేశంలో పలు అర్ధవాహక తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు అణు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని కూడా గణనీయంగా పెంచే లక్ష్యాలను వివరించారు.

# పేదల కడుపు మంటపై రాజకీయం!

## 'సన్న'గిల్లిన ప్రతిపక్షాలు... కాంగ్రెస్ 'స్మార్ట్' పందెం!

తెలంగాణ పౌరసరఫరాల వ్యవస్థ చుట్టూ ఇప్పుడు రాజకీయ వేడి పరాకాష్ఠకు చేరింది. గతంలో వరి వేస్తే ఉరి అని చెప్పి రైతులను తీవ్ర భయాందోళనలకు గురిచేసిన నాయకులకు, ఇప్పుడు పేదల కడుపు నింపేందుకు తెచ్చిన ఉచిత సన్నబియ్యం పథకానికి ఉన్న వ్యత్యాసమేంటో స్పష్టంగా చూపుతామంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విసిరిన అసెంబ్లీ రండి సవాల్ రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. పదేళ్ల పాటు పేదల రేషన్ కార్డుల దరఖాస్తులను పట్టించుకోకుండా కోల్డ్ స్టోరేజ్ లో పెట్టిన బీఆర్ఎస్, అలాగే ఉచిత బియ్యం పంపిణీ పేరుతో కేవలం రాజకీయ ప్రచారం మాత్రమే చేసుకున్న బీజేపీ పార్టీలు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులు, నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంపై విమర్శలు గుప్పించడం అత్యంత విడ్డూరంగా ఉంది. పేదవాడి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన పాత పాలకులు, తమ రాజకీయ ఉనికిని కాపాడుకోవడం కోసం ఉచితాల చుట్టూ అల్లిన విమర్శల నాటకాలను ఎండగట్టడానికి ఇది సరైన సమయంగా కనిపిస్తోంది. గడిచిన పదేళ్ల బీఆర్ఎస్ పాలనా కాలాన్ని నిష్పాక్షికంగా పరిశీలిస్తే, బంగారు తెలంగాణ అనే రంగుల కలల ప్రచారం వెనుక పేదల ప్రాథమిక హక్కులను ఏ విధంగా కాలరాశారో చాలా స్పష్టమవుతుంది. వివాహమై కొత్తగా కాపురం పెట్టుకున్న లక్షలాది మంది యువ జంటలు, నిరుపేద కుటుంబాలు పదేళ్ల పాటు ఒక కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుని మీ-సేవ కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఫలితం లేకుండా పోయింది. క్రమబద్ధంగా కొత్త కార్డులు ఇవ్వకపోవడం ద్వారా వేల కోట్ల రూపాయల సబ్సిడీ భారాన్ని ఆదా చేశామని సంబరపడటం తప్ప, అర్హులైన ప్రతి పేదవాడికి ప్రాథమిక ఆహార భద్రత కల్పించాలనే కనీస బాధ్యతారాహిత్యం గత ప్రభుత్వంలో కొట్టొచ్చినట్లు కనిపించింది. మరోవైపు గత ప్రభుత్వ హయాంలో రేషన్ దుకాణాల ద్వారా ఇచ్చిన లావు దొడ్డు బియ్యాన్ని పేదలు నేరుగా తినలేక, అత్యంత తక్కువ ధరకు దళారులకు లేదా బ్లాక్ మార్కెట్ వ్యాపారులకు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆ బియ్యం తిరిగి పశువుల దాణాగా మారడం లేదా రీసైక్లింగ్ అయి మళ్లీ రైస్ మిల్లులకు చేరడం బహిరంగ రహస్యంగా మారింది. పేదవాడి ఆకలి తీర్చడం అనే నెపంతో వేల కోట్ల ప్రజాధనాన్ని అక్రమార్కులు, దళారుల జేబుల్లోకి మళ్లించిన ఘనత ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుంది.

మరొకవైపు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ వైఖరి కూడా అంతకంటే విడ్డూరంగా తయారైంది. జాతీయ ఆహార భద్రతా చట్టం కింద రాష్ట్రాలకు కేటాయించే ధాన్యంలో తన వాటా ఎంత ఉందో స్పష్టంగా చెప్పకుండా, అంతా తామే ఉచితంగా ఇస్తున్నట్లు సొంత డబ్బా కొట్టుకోవడంలోనే కేంద్ర బీజేపీ నాయకులు నిత్యం బిజీగా గడుపుతున్నారు. రేషన్ కార్డులపై లేదా బియ్యం సంచులపై ప్రధాని మోడీ బొమ్మ ఉండాలని పట్టుబట్టే బీజేపీ నాయకులు, ఆ బియ్యాన్ని గ్రామ గ్రామాన ఉన్న పేదలకు సురక్షితంగా చేరవేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సొంత నిధుల నుండి భరిస్తున్న వేల కోట్ల రూపాయల రవాణా, గోదాముల నిర్వహణ, హమాలీ, పంపిణీ సబ్సిడీల గురించి ఎందుకు నోరు మెదపరో ప్రజలకు సమాధానం చెప్పాలి. పేదవాడికి కేవలం దొడ్డు బియ్యం ఇస్తే సరిపోతుందనే అహంకార ధోరణి బీజేపీలో కనిపిస్తోంది. మరి తమ సొంత పాలనలో ఉన్న ఏ ఒక్క రాష్ట్రంలోనైనా పేదలకు ఉచితంగా నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ చేసే ధైర్యం లేదా సాహసం బీజేపీ ప్రభుత్వం చేసిందా అంటే అక్కడ అస్సలు సమాధానం ఉండదు. ఒకవైపు సన్ ఫ్లవర్ నూనె, గ్యాస్, పప్పు ధాన్యాలు వంటి నిత్యావసర వస్తువుల ధరలను ఆకాశానికి ఎత్తేసి, సామాన్య మధ్యతరగతి ప్రజల నడుము విరిచిన బీజేపీకి తెలంగాణలో అమలువుతున్న సంక్షేమ రేషన్ వ్యవస్థపై విమర్శలు చేసే నైతిక అర్హత ఎంతమాత్రమూ లేదు.

రాజకీయంగా విశ్లేషిస్తే రేషన్ కార్డులు, ఆహార భద్రత విషయంలో బీఆర్ఎస్, బీజేపీలు రెండూ వేర్వేరు కావు. వారు నాణేనికి బొమ్మ, బొరుసు లాంటివారు. ఒకరు అధికారంలో ఉండి పేదలకు కొత్త రేషన్ కార్డులు ఇవ్వకుండా పదేళ్ల పాటు ఏడిపిస్తే, మరొకరు కేంద్రంలో ఉండి నిత్యావసరాల ధరలను విపరీతంగా పెంచి పేదవాడి గరిటెలో అన్నం లేకుండా చేశారు. ఈ రెండు ప్రతిపక్ష పార్టీలు తమ పాలనలో పేదలకు బుక్కెడు మంచి నాణ్యమైన బువ్వ పెట్టాలనే ఆలోచన ఎప్పుడైనా చేశాయా అంటే చరిత్ర పుటల్లో ఆ దాఖలాలు ఎక్కడా కనిపించవు. శాసనసభకు వచ్చి ప్రజా సమస్యలు, రైతుల సంక్షేమంపై నేరుగా అధికార పక్షంతో చర్చించే ధైర్యం లేక, కేవలం బయట మీడియా మైకుల ముందు అసత్య ప్రచారాలు చేయడం విపక్షాల నాయకత్వ బలహీనతకు స్పష్టమైన నిదర్శనంగా నిలుస్తోంది.

?ంవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పౌరసరఫరాల శాఖలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టింది. కోటి 6 లక్షల మందికి కొత్తగా స్మార్ట్ రేషన్ కార్డులు అందించడం ద్వారా ప్రజల్లో ఉన్న పదేళ్ల సుదీర్ఘ నిరీక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం తెరదించింది. రాష్ట్రంలో ఉన్న 3 కోట్ల 48 లక్షల మంది ప్రజలకు రోజూ తినడానికి నాణ్యమైన సన్నబియ్యాన్ని ఉచితంగా అందించడం అనేది తెలంగాణ పౌరసరఫరాల చరిత్రలోనే ఒక విప్లవాత్మక నిర్ణయం. ధనవంతులు తినే నాణ్యమైన సన్న అన్నాన్ని పేదవాడు కూడా తిని తీరాలనే ఈ నిర్ణయం పేదల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా ఉంది. అంతేకాక ఇన్నాళ్లూ సాగిన రేషన్ బియ్యం అక్రమ రీసైక్లింగ్ మాఫియా నడుము విరిచేందుకు ఇది అత్యుత్తమమైన మందుగా పనిచేస్తుంది. ఇక రేషన్ కార్డు అనేది కేవలం కాగితపు ముక్క కాదు, అది పేదవాడి హక్కు, గుర్తింపు. క్యూఆర్ కోడ్ సాంకేతికత కలిగిన స్మార్ట్ కార్డులను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా దొంగ కార్డులకు, బియ్యం పక్కదారి పట్టించే అక్రమ రవాణాకు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా చరమగీతం పాడింది.

ముగింపుగా చెప్పాలంటే ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీల విమర్శలు కేవలం రాజకీయ అసూయ, ఉనికిని కాపాడుకునే తాపత్రయంతో కూడుకున్నవి మాత్రమేనని స్పష్టమవుతోంది. గత పదేళ్ల తమ పాలనలో తాము చేయలేని మంచి పనులను, ఇప్పుడు కొత్త కాంగ్రెస్ ప్రభుత్వం వేగంగా చేస్తుంటే చూసి ఓర్వలేక అడ్డుపడటం విపక్షాల దిగజారుడు రాజకీయాన్ని తెలియజేస్తోంది. రాష్ట్రంపై ఉన్న ఆర్థిక సవాళ్లు, అప్పుల భారాన్ని తట్టుకుంటూ 3.48 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ నిరంతరాయంగా, పారదర్శకంగా సాగేలా చూడడమే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ముందున్న ప్రధానమైన బాధ్యత. ఈ పథకం గనుక క్షేత్రస్థాయిలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పక్కాగా అమలు జరిగితే, ప్రతిపక్షాల విమర్శల నోళ్లకు శాశ్వతంగా పూత పడటం ఖాయం!



**వెంక గారి భూమయ్య**
**సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ**
**9848559863**

## ఉత్తమ సేవలకు ముధోల్ వైద్య సిబ్బందికి అవార్డులు

ముధోల్, ఆగస్టు 15(తెలంగాణ వెన్నెల వాక్కు ):జిల్లా కేంద్రంలో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన ముధోల్ సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) సిబ్బందికి అవార్డులు అందజేశారు. సీహెచ్‌సీ ముధోల్ వైద్యుడు డా. మల్లికార్జున్, హెడ్ నర్స్ సరోజ, హెల్త్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీలకు జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. జాదవ్ అనిల్ కుమార్, వైద్యులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ అవార్డు గ్రహీతలకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.





విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన సిబ్బందిని గుర్తించి అవార్డులు అందించడం ఇతర సిబ్బందికి స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు

## మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

నిర్మల్, ఆగస్టు 15 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ అప్పాల కావ్య, వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంద్ అలీలతో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం సర్వస్వం అర్పించిన సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వారి ఆశయ సాధనకు అనుగుణంగా పట్టణ ప్రగతికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.
అనంతరం గాంధీ పార్క్, ట్యాంక్ బండ్ మరియు బుధవార్‌పేట్ 36వ వార్డుల్లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాలను ఎగురవేశారు. మున్సిపాలిటీ పరిధిలోని పారిశుధ్య కార్మికులు, సిబ్బంది సేవలను కొనియాడారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, డీఈ హరిభువన్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.



## మహిళల సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యత

ముధోల్, ఆగస్టు 15(తెలంగాణ వెన్నెల వాక్కు ):మహిళల ఆర్థిక సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. మహిళలు స్వయం సమృద్ధి సాధించేలా ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ముధోల్ మండలంలోని మచ్కల్ గ్రామంలో సర్పంచ్ కళ్యాణకర్ ఆత్మ స్వరూప్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మహిళా సమైక్య భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మహిళా సంఘాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడంతో పాటు వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మహిళలు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. అనంతరం గ్రామంలోని ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో అన్నాభావు సాఠే జయంతిని ఘనంగా నిర్వహించారు. అన్నబాహు సాటే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను ఎమ్మెల్యే స్మరించుకున్నారు. సామాజిక చైతన్యం, సమానత్వం కోసం అన్నాభావు సాఠే చేసిన కృషి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, మున్సిపల్ చైర్మన్ తుమ్మల దత్తు, పిఎసిఎస్ చైర్మన్ అంబేకర్ సాయిరాం, మాజీ జెడ్పీటీసీ లక్ష్మీనర్సాగౌడ్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కల్లెడ కిష్టయ్య, సర్పంచులు గంగాధర్, ధూమా నాయక్, గణేష్ యాదవ్, ఎంపీడీవో శివకుమార్, ఏపీవో శిరీష, ఏపీఎం గురుచరణ్, స్థానిక నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## అమరవీరుల త్యాగాలతోనే దేశానికి స్వాతంత్ర్యం: ఏబీవీపీ

నిర్మల్, ఆగస్టు 15 (తెలంగాణ వెన్నెల వాక్కు):
అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నిర్మల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని వివేకానంద విగ్రహం వద్ద 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఉత్సాహంగా నిర్వహించారు.
విగ్రహం వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నారపు అమృత్ చారి మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం ఏ ఒక్కరి వల్లో రాలేదని, వీర సావర్కర్, భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్, సుభాష్ చంద్రబోస్ వంటి ఎందరో వీరుల ప్రాణత్యాగాల ఫలితమేనని స్పష్టం చేశారు.
వారి త్యాగాలను స్మరించుకుంటూ భారతదేశాన్ని ప్రపంచంలోనే విశ్వగురువుగా నిలిపేందుకు యువత వికసిత్ భారత్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ దినేష్, విద్యార్థి నాయకులు అభి, వంశీ, పవన్ మరియు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



## ఎన్టీఆర్ స్టేడియంలో కన్నుల పండువగా స్వాతంత్ర్య వేడుకలు

**- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వ విప్ వేముల వీరేశం**
**- ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు.. మహిళా సంఘాలకు 50 కోట్ల చెక్కుల పంపిణీ**

నిర్మల్, ఆగస్టు 15 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం అత్యంత వైభవంగా, కన్నుల పండువగా జరిగాయి. ఈ వేడుకలకు ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసనసభ్యుడు వేముల వీరేశం ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, నిర్మల్ శాసనసభ్యుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.



**పోలీసుల గౌరవ వందనం.. పరేడ్ ప్రదర్శన:**
వేడుకల ప్రాంగణానికి విచ్చేసిన ముఖ్యఅతిథి వేముల వీరేశంకు జిల్లా అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించి మువ్వన్నెల జాతీయ జెండాను ఎగురవేశారు. జాతీయ గీతాలాపన, తెలంగాణ రాష్ట్ర గీతాలాపనతో మైదానం మారుమోగింది. ఈ సందర్భంగా సాయుధ పోలీసు బలగాలు నిర్వహించిన కవాతు (పరేడ్) ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది.

**తెలంగాణ సంక్షేమ పథకాలపై ప్రభుత్వ విప్ సందేశం:**
ఈ సందర్భంగా ముఖ్యఅతిథి మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం ప్రజాపాలన అందిస్తోందన్నారు. జిల్లాలో అమలవుతున్న సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి చేరుతున్నాయన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టి కృషితో పనిచేస్తూ నిర్మల్ జిల్లాను రాష్ట్రంలోనే అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపాలని పిలుపునిచ్చారు.

**ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాల ప్రదానం:**
విధి నిర్వహణలో విశిష్ట ప్రతిభ కనబరిచిన జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి ప్రభుత్వ విప్, కలెక్టర్, ఎమ్మెల్యేలు ప్రశంసా పత్రాలను అందజేసి సత్కరించారు. అవార్డులు ఉద్యోగుల బాధ్యతను మరింత పెంచుతాయని, ప్రజలకు మరింత పారదర్శకమైన సేవలు అందించాలని సూచించారు.

**విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, శకటాల వీక్షణ:**
పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. వివిధ శాఖల అభివృద్ధిని ప్రతిబింబిస్తూ ఏర్పాటు చేసిన శకటాల ప్రదర్శనను, ప్రభుత్వ పథకాల స్టాళ్లను అతిథులు తిలకించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు మంజూరైన 50 కోట్ల రూపాయల విలువైన రుణ చెక్కులను సంఘాల ప్రతినిధులకు అందజేశారు.
ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, జిల్లా అటవీశాఖ అధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఏఎస్పీ సాయి కిరణ్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రాలు





నిర్మల్, ఆగస్టు 15: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్మల్ జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. జిల్లా స్థాయిలో మొత్తం 172 మంది అధికారులు, సిబ్బందిని ఈ జాబితాలో ఎంపిక చేశారు. శాఖల వారీగా ఎంపికైన వారి వివరాలు ఇలా ఉన్నాయి.

**జిల్లా అధికారులు, కలెక్టరేట్:** బి.వెంకటేశ్వర్లు, ఐఏఎస్, ఏసీ (ఎల్బీ); ఎల్.కిశోర్‌కుమార్, ఏసీ (రెవెన్యూ); విజయలక్ష్మి, డీఆర్‌డీఓ. కలెక్టరేట్‌కు చెందిన పి.ప్రవీణ్‌కుమార్, ఏఓ; ఎ.సంధ్యారాణి, సూపరింటెండెంట్–డి; సంతోష్, సూపరింటెండెంట్–1; ఎం.నితీష్, సీనియర్ అసిస్టెంట్; ఎస్.ప్రణిత, జూనియర్ అసిస్టెంట్; బి.జగన్, జూనియర్ అసిస్టెంట్; మమత, జూనియర్ అసిస్టెంట్; బి.మల్లేష్, రికార్డు అసిస్టెంట్; సూర్దాస్, హెచ్‌హెచ్‌పీ.

**రెవెన్యూ శాఖ: ఖాజా మొయినుద్దీన్,** తహసీల్దార్, కడెం; విజయకాంత్‌రావు, తహసీల్దార్, సారంగాపూర్; మహ్మద్ మొహియుద్దీన్, మండల గిర్దావర్, నిర్మల్ అర్బన్ తహసీల్ కార్యాలయం; నిర్మల గంగారాణి, జీపీఓ, నిర్మల్ అర్బన్; కె.రేఖ, జీపీఓ, మంజులాపూర్ గ్రామం, నిర్మల్ రూరల్ తహసీల్ కార్యాలయం; కునా సుష్మిత్, జూనియర్ అసిస్టెంట్, మామడ; నుమాన్ అహ్మద్‌ఖాన్, జూనియర్ అసిస్టెంట్, సబ్ కలెక్టర్ కార్యాలయం, భైంసా; సురేందర్, ఆఫీస్ సబార్డినేట్, సబ్ కలెక్టర్ కార్యాలయం, భైంసా; జవార్‌సింగ్, మండల సర్వేయర్, తహసీల్దార్ కార్యాలయం, భైంసా; రాజేశ్వర్, **ఎంఆర్ఐ, తహసీల్దార్ కార్యాలయం, కుంటాల.**

పోలీస్ శాఖ: టి.సాయికుమార్, సీఐపీ; ఎం.సుప్రియ, ఎస్ఐపీ; జె.వినోద్‌కుమార్, ఆర్ఎస్ఐ; చ.విజయ్, ఆర్ఎస్ఐ; ఎన్.రాకేష్, ఆర్ఎస్ఐ; పి.మహేందర్‌రెడ్డి, ఆర్ఎస్ఐ; మహ్మద్ మంజూర్, సీనియర్ అసిస్టెంట్; కె.అనిల్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్; మహ్మద్ షౌకత్, ఏఎస్ఐ 543; విజయ్, ఏఆర్ఎస్ఐ 2470; ఎల్.సురేష్, ఏఆర్‌హెచ్‌సీ–2659; జి.రాజు, ఏఆర్‌హెచ్‌సీ 166; పి.నరేష్, పీసీ 3009; కె.సునీల్‌కుమార్, పీసీ 2876; చ.శివకుమార్, పీసీ 587; ఎ.గంగాధర్, పీసీ 2303; బి.హర్షవర్ధన్‌రెడ్డి, పీసీ 3914; ఆకాష్, పీసీ 79; అమర్‌నాథ్, పీసీ 3918; శ్రీనివాస్, పీసీ 3379; నవీన్, పీసీ 1874; వినోద్, పీసీ 3558; వినయ్, పీసీ 55; రాజు, పీసీ 3222; కె.సురేష్, పీసీ 1281; కె.శంభుదేవ్, పీసీ 3795; ఎం.సదానందం, పీసీ 2437; బి.సవిత, డబ్ల్యూపీసీ 2102; బి.విజయలక్ష్మి, డబ్ల్యూపీసీ 3625; జి.ప్రతిభ, డబ్ల్యూపీసీ 1337; ఎ.యశ్వంత్‌రావు, ఏఆర్‌పీసీ 4180; ఎన్.రాము, ఏఆర్‌పీసీ 3753; టి.సతీష్, ఏఆర్‌పీసీ 210; శ్రీకాంత్‌రెడ్డి, ఏఆర్‌పీసీ 3650; శ్యామ్, ఏఆర్‌పీసీ 203; చరణ్, ఏఆర్‌పీసీ 159; వై.ముత్యం, ఏఆర్‌పీసీ 794; మహ్మద్ జహీర్, హెచ్‌జీ 1063; రాథోడ్ మోహన్, హెచ్‌జీ 950; ఎన్.సుమలత, డీబీ 213; డి.ఝాన్సీ, డీబీ 267.

**న్యాయ, జైలు, ఎక్సైజ్, ఇంటెలిజెన్స్** శాఖలు: ఇ.జాన్సీరాణి, సీనియర్ అసిస్టెంట్, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు; కె.రవి, ఆఫీస్ సబార్డినేట్, అదే కోర్టు; కె.శ్రీకాంత్, వార్డర్, జైలు, నిర్మల్; ఎ.వసంత్‌రావు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్, నిర్మల్; ఎస్.మహేష్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కానిస్టేబుల్, భైంసా; వి.ప్రవీణ్‌కుమార్, జోనల్ ఇన్‌స్పెక్టర్; ఈ.ప్రకాశ్, హెచ్‌సీ–2397, కంప్యూటర్ ఆపరేటర్, రీజినల్ ఇంటెలిజెన్స్ ఆఫీస్; కె.రాజు, ఏఆర్‌పీసీ–4253, ఫీల్డ్ డ్యూటీ.

**అటవీ శాఖ:** జి.శ్రీనివాస్‌రెడ్డి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, ఉంపూర్ రేంజ్; టి.శ్రీనివాస్‌రావు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, దిమ్మదుర్తి రేంజ్; కె.కిరణ్‌కుమార్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, ఖానాపూర్ రేంజ్; మహ్మద్ నజీర్‌ఖాన్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్, సారంగాపూర్ (డబ్ల్యూ) సెక్షన్; కె.రామచందర్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, నాగాపూర్ (ఈ) బీట్.

**ఇతర శాఖలు:** సయ్యద్ జావేద్‌అలీ, లీడింగ్ ఫైర్ ఫైటర్; బి.జయరామ్‌గురు, సబ్ ట్రెజరీ ఆఫీసర్; కె.సంధ్యారాణి, సీనియర్ అకౌంటెంట్; ఎం.భూమేష్, మీ సేవ ఆపరేటర్; బి.నీరజ్‌కుమార్, ఎంపీడీఓ, భైంసా; లైక్–ఉర్–రహ్మాన్‌ఖాన్, సీనియర్ అసిస్టెంట్, కుబీర్; జె.జయంతి, జూనియర్ అసిస్టెంట్; జి.సాయికిరణ్, ఆఫీస్ సబార్డినేట్; శ్రీనివాస్‌గౌడ్, ఎంపీఓ, నిర్మల్ రూరల్; జి.కమల, పంచాయతీ కార్యదర్శి, మటేగావ్; చిట్టి ఎల్లన్న, మల్టీపర్పస్ వర్కర్; ఎస్.నాగేష్, కంప్యూటర్ ఆపరేటర్, తానూర్.

**గ్రామీణాభివృద్ధి శాఖ:** వి.జయదేవ్, ఏపీఓ, కడెంపెద్దూర్; ఎన్.నర్సింహారెడ్డి, టీఏ, నిర్మల్ మండలం; ఖాన్ ఆబిత్‌ఖాన్, ఫీల్డ్ అసిస్టెంట్, తరోడా క్లస్టర్; ఎ.హరిప్రసాద్, సీఓ అండ్ ఏఏ, డీఆర్‌డీఏ; అడ్డిగ బోసు, ఏపీఎం, దిలావర్‌పూర్; వెంబడి లావణ్య, సీసీ, దస్తూరాబాద్; బి.రాములు, వీఓఏ, సిద్ధూర్.

**వైద్య, ఆరోగ్య శాఖలు:** బి.కవిత, స్టాటిస్టికల్ ఆఫీసర్; మహ్మద్ వైజ్ తమీమ్, జూనియర్ అసిస్టెంట్; డా. రాజశేఖర్, మెడికల్ ఆఫీసర్, పీహెచ్‌సీ పెంబి; కొమురయ్య, హెల్త్ సూపర్‌వైజర్, పీహెచ్‌సీ కడెం; మహ్మద్ ఇబ్రహీం, జూనియర్ అసిస్టెంట్, జిల్లా ఆసుపత్రి; డా. మల్లికార్జున్ చవాన్, సివిల్ అసిస్టెంట్ సర్జన్, ఏరియా ఆసుపత్రి భైంసా; డా. బి.వంశీమాధవ్, డిప్యూటీ సివిల్ సర్జన్, సీహెచ్‌సీ ఖానాపూర్; వి.సరోజ, హెడ్ నర్స్, సీహెచ్‌సీ ముధోల్; శ్రీనివాసచారి, ఫార్మసిస్ట్ గ్రేడ్–1; కె.లక్ష్మి, హెల్త్ ఇన్‌స్పెక్టర్; డా.టి.దివ్యజ్ఞ, అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ పాథాలజీ; డా.సంతోషి మటం, జీహెచ్‌డీ పొన్కల్; డా.జె.రమేష్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ; బి.మహేందర్, కెప్టెన్; కె.సేవ, ఈఎంటీ, కడెం; చ.తిరుపతి, ఈఎంటీ, ఖానాపూర్; పుర్క శిరీష్, ఆరోగ్య మిత్ర.

**మహిళా, శిశు సంక్షేమం:** ఎ.భారతి, గ్రేడ్–1 సూపర్‌వైజర్; బి.శ్యామల, గ్రేడ్–2 సూపర్‌వైజర్.

**విద్య, సంక్షేమ శాఖలు:** ఎస్.రాఘవేందర్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్; వి.అడెల్లా, కమాటి; అనిల్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ అండ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్; ఎ.పల్లవి, హాస్టల్ **వెల్ఫేర్ ఆఫీసర్;** పసుల స్వామి, ఏసీఎస్ఓ; జి.రాజ్‌కుమార్, అసిస్టెంట్ గ్రేడ్–2; ఎస్.రాజమల్లు, అసిస్టెంట్ రిజిస్ట్రార్; డా.బి.ఉమేష్, కామర్స్ లెక్చరర్; కె.దివ్య, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ లెక్చరర్; జూఫిషాన్ సుల్తానా, ప్రిన్సిపాల్; మేరాజ్ మహమూద్, జూనియర్ లెక్చరర్; ఎం.పరమేశ్వర్, ఏసీజీఈ; బి.నరేందర్, ఎంఈఓ, తానూర్; చ.శకుంతల, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్; డి.సురేష్, లెక్చరర్, ప్రభుత్వ పాలిటెక్నిక్; ఇలియాస్ అహ్మద్, జూనియర్ లెక్చరర్ ఉర్దూ; టి.అమృత, ఎంజేపీ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీ, ముధోల్.

**ఇతర శాఖలు:** ఎం.సత్యనారాయణ, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎస్ఏ; ఎస్.ప్రేమలత, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎస్ఏ; గంధారి వినయ్, జూనియర్ అసిస్టెంట్; ఎం.అరుణ్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్; ఎస్.శశాంక్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్; ఈ.ఉదయ్ భాస్కర్‌రెడ్డి, సూపరింటెండెంట్; జి.లక్ష్మీ ప్రసన్న, ఏఈఈ; టి.ముత్తేష్, జూనియర్ అసిస్టెంట్; పి.ప్రవీణ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్; ఎ.మధు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్; జడి శ్రీనివాస్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్; కె.సరోజ, జూనియర్ అసిస్టెంట్; ఎన్.మహేష్‌కుమార్, బీటెక్ అసిస్టెంట్ ఇంజనీర్; ఎన్.ప్రవీణ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్; చిట్టి సాయన్న, పబ్లిక్ హెల్త్ వర్కర్; రాజుల శ్రీవర్ష, జూనియర్ అసిస్టెంట్; మహ్మద్ ఆసిఫ్ అహ్మద్, అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్; ఎల్.ప్రమోద్‌కుమార్, ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుల్.

**రవాణా, విద్యుత్, బ్యాంకింగ్, ఇతర శాఖలు:** ఎం.ఎ.రావు, కండక్టర్; ఎన్.ఆర్.శేఖర్, స్టేషన్ మేనేజర్; పవార్ మంజుల, జూనియర్ అసిస్టెంట్; జె.సంజీవ్, అసిస్టెంట్ ఇంజనీర్; ముల్లా అజీముద్దీన్, అడిషనల్ అసిస్టెంట్ **ఇంజనీర్;** జి.రవీందర్, అసిస్టెంట్ లైన్‌మెన్; బి.ప్రేమలత, సూపరింటెండెంట్; ఎన్.రాజశేఖర్, టీజీబీ; కె.దయానందం, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్; కె.మహేష్‌బాబు, అసిస్టెంట్ ఇంజనీర్; చ.సంతోష్, సూపర్‌వైజర్; ఎన్.చందు, సూపర్‌వైజర్; జి.సాయిప్రసాద్, వర్కర్; జె.వంశీకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్; బి.నాగరాజు, ఎంఏఓ; శ్రీ విఖార్ అహ్మద్, ఎంఏఓ; జి.రాము, ఏఈఓ; సుచరిత, ఏఈఓ; శ్రీ అజయ్, ఏఈఓ; శ్రీ మొయిన్ మియా, హెచ్‌ఈఓ; డా.ఎస్.మహేష్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్; వి.ప్రశాంత్, ఆఫీస్ సబార్డినేట్; అంగ ఈశ్వర్, క్యాటరింగ్ కాంట్రాక్టర్.

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి ఈ గుర్తింపు లభించడం పట్ల జిల్లా యంత్రాంగం అభినందనలు తెలిపింది.

# జిల్లా పోలీసు కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ఏఎస్పీ



నిర్మల్, ఆగస్టు 15 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను దేశభక్తి భావం ఉట్టిపడేలా శనివారం ఘనంగా నిర్వహించారు. భైంసా ఏఎస్పీ సాయి కిరణ్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసు సిబ్బంది గౌరవ వందనాన్ని స్వీకరించారు.

అనంతరం ఏఎస్పీ మాట్లాడుతూ.. ఎందరో మహనీయుల ప్రాణత్యాగాల వల్ల లభించిన స్వాతంత్ర్యాన్ని కాపాడుకుంటూ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ సమర్థవంతంగా పనిచేయాలన్నారు. సమాజంలో నేరాల నియంత్రణ, మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నిర్మూలనపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజల విశ్వాసాన్ని చూరగొనేలా ప్రతి పోలీసు ఉద్యోగి క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.

వేడుకల అనంతరం పోలీసు సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో ఏఓ మహమ్మద్ యూనస్ అలీ, డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు కృష్ణ, సమ్మయ్య, మల్లేష్, ఆర్ఐలు రామ్‌నిరంజన్, త్రిపాల్, శేఖర్, ఎస్ఐలు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్యం అంటే సమాన హక్కులు, అవకాశాలు: జగన్ మోహన్

నిర్మల్, ఆగస్టు 15 (తెలంగాణ వెన్నెల వాక్కు): స్వాతంత్ర్యం అంటే సమాజంలోని ప్రతి పౌరుడికి సమాన హక్కులు, సమాన అవకాశాలు లభించడమేనని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) నిర్మల్ జిల్లా అధ్యక్షుడు అడ్వకేట్ జగన్ మోహన్ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎందరో మహనీయుల పోరాట ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించినప్పటికీ, సమాజంలో నేటికీ అసమానతలు కొనసాగడం ఆందోళనకరమన్నారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అణగారిన వర్గాల విద్యా, ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు.

# ప్రభుత్వ విప్ వేముల వీరేశంను కలిసిన ప్రెస్ క్లబ్ ప్రతినిధులు



నిర్మల్, ఆగస్టు 15 (తెలంగాణ వెన్నెల వాక్కు): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ముఖ్య అతిథిగా నిర్మల్ జిల్లాకు విచ్చేసిన ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంను నిర్మల్ ప్రెస్ క్లబ్ ప్రతినిధులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ బాధ్యులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్ల అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని ప్రభుత్వ విప్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

# బాసర గోదావరిలో ప్రమాదవశాత్తు మునిగి మేడ్చల్ యువకుడు మృతి



బాసర, ఆగస్టు 15 (తెలంగాణ వెన్నెల వాక్కు): బాసర పుణ్యక్షేత్రంలోని గోదావరి నదిలో స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మేడ్చల్ ప్రాంతానికి చెందిన శ్రీవత్స క్రిష్ (30) అనే యువకుడు మృతి చెందాడు. శనివారం ఉదయం గజ ఈతగాళ్ల సహాయంతో పోలీసులు మృతదేహాన్ని వెలికితీశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల మరణించిన తన తాత అస్తికలను గోదావరి నదిలో కలపడానికి శ్రీవత్స క్రిష్ తన కుటుంబ సభ్యులతో కలిసి బాసరకు వచ్చాడు. శుక్రవారం అర్ధరాత్రి గోదావరి ఘాట్ వద్దకు వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు కాలుజారి నదిలో పడిపోయాడు.

చీకటిగా ఉండటంతో నీటి ప్రవాహంలో గల్లంతయ్యాడు. శనివారం ఉదయం గాలించి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి అశోక్ ఫిర్యాదు మేరకు బాసర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# దిలావర్‌పూర్ మండలంలో ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహణ



దిలావర్‌పూర్, ఆగస్టు 15 (తెలంగాణ వెన్నెల వాక్కు): దిలావర్‌పూర్ మండల ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించే లక్ష్యంతో ప్రతి సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అరుణ రాణి తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

గ్రామీణ ప్రాంత ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలు, సంక్షేమ పథకాలపై ఫిర్యాదులు, దరఖాస్తులను నేరుగా ప్రజావాణిలో సమర్పించవచ్చని సూచించారు.

వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు ప్రజావాణికి హాజరై ప్రజల నుండి వినతులను స్వీకరిస్తారని, వాటిని క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎంపీడీవో విజ్ఞప్తి చేశారు.

# ఆప్ జిల్లా కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు



నిర్మల్, ఆగస్టు 15 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కార్యాలయంలో 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆప్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సయ్యద్ హైదర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ సమగ్రత, లౌకిక విలువల పరిరక్షణకు ప్రతి పౌరుడు పాటుపడాలన్నారు. సామాన్య ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించడమే నిజమైన స్వాతంత్ర్య ఫలమని పేర్కొన్నారు.

అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ దేశ పునర్నిర్మాణంలో యువత ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మిఠాయిలు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో ఆప్ జిల్లా జనరల్ సెక్రటరీ సి.హెచ్. వినోద్ కుమార్, ట్రెజరర్ అబ్దుల్ సాదిక్, వసంతారావు, మెరుగు రాజన్న, సోఫీ ఇల్లియాస్ తదితరులు పాల్గొన్నారు.౦

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో చిన్నారి దేశభక్తి



దిలావర్‌పూర్, ఆగస్టు 15 (తెలంగాణ వెన్నెల వాక్కు): దిలావర్ పూర్, ఆగస్టు 15: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో నీ శివ శివాని దంపతుల కుమార్తె తరణి జాతీయ జెండాను చేతబట్టి ముద్దుగా దర్శనమిస్తూ ఆకట్టుకుంది. త్రివర్ణ పతాకం రంగులతో అలంకరించిన దుస్తులు, చేతికి త్రివర్ణ కంకణాలతో చిన్నారి దేశభక్తిని చాటుతూ అందరి దృష్టిని ఆకర్షించింది దేశ స్వాతంత్ర్యాన్ని స్మరించుకుంటూ చిన్నారి చేతిలో జాతీయ జెండాతో ఉన్న ఈ దృశ్యం పలువురిని ఆకట్టుకుంది. “దేశభక్తికి వయసుతో సంబంధం లేదు.. చిన్నారుల్లోనూ జాతీయ స్ఫూర్తి వెల్లివిరియాలి” అంటూ పలువురు అభినందించారు.

# బాగులవాడ శిశు మందిరంలో స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు

నిర్మల్, ఆగస్టు 15 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ పట్టణంలోని బాగులవాడ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. ఉమ్మడి మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వి. సత్యనారాయణ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ, నేతాజీ, భగత్ సింగ్, వల్లభాయ్ పటేల్ వంటి ఎందరో యోధుల రక్తతర్పణంతోనే నేడు మనం స్వేచ్ఛావాయువులు పీలుస్తున్నామన్నారు. దేశంలో పేదరికం, నిరక్షరాస్యతను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, దేశభక్తిని అలవర్చుకుని ఉన్నత చదువులు చదివి దేశ వికాసానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. భారతదేశం ఆర్థికంగా ప్రపంచంలో మూడవ స్థానానికి ఎదుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సరస్వతి విద్యాపీఠం బాధ్యుడు సూర్యనారాయణ, ప్రిన్సిపాల్ రవీందర్, డాక్టర్ ప్రవీణ్, జొన్న విజయ్ కుమార్, మహిపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER TG-TEL/25/A0871, CELL: 9848568953, MAIL ID: telanganavennelawakku@gmail.com